# యక్ష ప్రశ్నలు

**మొ**దటి బిడ్డ పెళ్లి చేసే సరికి సంజీవప్ప నడ్డివిరిగిపోయింది. ఇంకో కూతురు వుంది. ఆ కూతురు పెళ్ళికూడా నిశ్చయమైపోయింది. ఆ పెళ్లి ఎలా చేయాలన్నది ఇప్పుడు అతడికి పెద్ద సమస్య అయికూచుంది.

సంజీవప్ప మంచి భూవసతివున్న రైతుకిందే లెక్క, ఆ వూళ్లో! వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు. వాళ్లంతా విడిపోకముందు వాళ్ల నాన్న ఆ వూళ్లో మోతుబరి రైతు. అరవై ఎకరాల మెట్ట, నీటి వసతి వున్న పదెకరాల తోట, మూడు కాండ్ల ఎద్దులూ, రెండు గిత్తలూ. నాలుగైదు వూళ్లలో మంచి గుర్తింపు కలిగిన వాడు వాళ్ల నాన్న. వాళ్ల నాన్న వెంకటరమణప్ప అంటే ఆ వూళ్లో అందరూ చేతులెత్తి మొక్కేవాళ్లు. వాళ్ల కులంలో ఎవరు ఏ కొనుగోలు చేయాలన్నా, తమ ఇళ్లలో ఏ శుభకార్యాలు చేయాలన్నా ఆయన్ను సంప్రదించకుండా చేసే వాళ్లు కాదు. ఆయన ఇల్లు ఎప్పుడూ వచ్చే పొయ్యే జనంతో సందడిగా వుండేది. అతని ఇంటి వసారాలలో పరచిన పెద్దకంబడి మీద ఆ వూరి మనుషులు ఎందరో కొందరు ఎప్పుడూ ఏదో పనిమీదనో, లేదా ఉబుసుపోకనో కూచుని కాఫీలు తాగుతూ వక్కాకు నములుతూ బీడీలు కాలుస్తూ ఆనందంగా కాలం గడిపేవాళ్లు. వాళ్ల ఇంటి ముందు పడిన తుంట బీడీలు ఏరుకొనేందుకే కూలీనాలీజనమూ, అల్లరి చిల్లరి పిలగాళ్లు అటుఇటు తచ్చాడేవాళ్లు. ఆ ఇంట్లో పొయ్యిలు ఎప్పుడూ వెలుగుతూన్నట్టే వుండేవి. పెట్టిపోతలకు ఆ ఇంటినే ముందుగా చెప్పుకొనేవాళ్లు. ఆ వూళ్లో తెల్లారేసరికల్లా పెద్దకాగునిండా మజ్జిగ నింపి అవి అయిపోయే వరకూ వచ్చిన వాళ్లందరికీ ఆప్యాయంగా పోసేవాళ్లు. కూరగాయలైతే ఇంటి వరకు రాకనే దారిలోనే సగం దానాల కింద పోయేవి.

వెంకటరమణప్ప కొడుకులు ముగ్గురూ మంచి సేద్యగాళ్లు. అనంతపురంలో కొడుకుల్ని చదవేశాడు గాని వాళ్లెవరూ హైస్కూల్ చదువు దాటలేకపోయారు. తమకున్న భూమిదన్ను వాళ్ల చదువుల్ని సాగనియ్యకుండా చేసింది. “చేసుకునేంత భూమి వుంది మీకేలరా చదువులూ, ఉద్యోగాలూ” అని నలుగురూ అనేమాటను వాళ్లు సార్థకం చేశారు. మంచి సేద్యగాళ్లుగా తయారై, తాము స్వయంగా వంగి చేస్తూ కూలీనాలీ జనంతో చేయించేవాళ్లు. పుట్లకు పుట్లు వడ్లూ, రాగులూ, జొన్నలూ చేనులో పండేవి. మెట్టభూముల్లో, వేరు శనగ, కంది, పెసర, నువ్వులు, అలసంద వేసేవాళ్లు – అవి

పండినంత మేరకు పండేవి. వాణిజ్య పంటల పట్ల పెద్దగ ఆసక్తి వుండేది కాదు, ఆ రోజుల్లో. అయిన పచ్చి ఎరువులన్నీ తోటకే వేయటంతో, మెట్టకు ఎరువులు వేయటం పట్ల శ్రద్ధ చూపేవాళ్లుకాదు – పశువులకు మేత లభిస్తే చాలనుకొనేవాళ్లు – అయినా ఆ పండిన పంటే తాము తినగా మిగిలింది అమ్మితే వచ్చే మొత్తం దాచుకోదగ్గదిగా వుండేది. తిండీ, బట్టా, తప్ప ఇతరత్రా ఏ అవసరాలూ లేకపోవటం వల్ల మిగిలిన డబ్బుతో బంగారు కొనేవాళ్లు – మంచాలు తప్ప, కుర్చీలు గాని, రేడియోలు గాని, ఫాన్లు గాని ఇలాంటివేవీ ఇంకా గ్రామ సీమల్లో అప్పటికి అడుగు పెట్టలేదు. ఇంట్లో ఆడవాళ్లకు కూడా నాలుగైదు చీరలకు మించి వుండేవి కావు. వెంకటరమణప్ప అయితే ఎప్పుడూ బనియనూ, పంచెతో, వుండేవాడు – జీవితం నెమ్మదిగా ప్రవహించే కాలువలా సాగేది –

కొడుకులు ముగ్గురికీ పెళ్లిళ్లయ్యేసరికి వాళ్ల కుటుంబపు ఆర్థిక జీవితంలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. కపిల స్థానంలో కరెంటు మోటార్లు వచ్చాయి. రసాయనికపు ఎరువులూ మందులూ వచ్చాయి. వ్యవసాయానికి శ్రమ స్థానంలో డబ్బు పెట్టుబడిగా మారింది. పెట్టుబడికి తగిన విధంగా పంట గిట్టటం లేదు – ఇంతకాలమూ వ్యవసాయానికి దూరంగా వున్న కులాల వాళ్లకు కూడా శివాయి సాగు భూములు పట్టా కింద లభించటంతో వాళ్లూ, చిన్న రైతులయ్యారు – పిలిస్తే పలికే కూలి జనం తగ్గిపోయారు – కూలీ రేట్లు కూడా కొద్దో గొప్పో పెరిగాయి – క్రమంగా వ్యవసాయం మీద వచ్చే ఆదాయం తగ్గిపోసాగింది – దీనికి తోడు ఇంట్లో ఖర్చులు కూడా క్రమంగా పెరిగాయి. బట్టల ఖర్చు పెరిగింది. గృహోపకారణాలూ, కొత్తవి వచ్చి పడ్డాయి. పట్టణానికి ప్రయాణాల అవసరం పెరిగింది. ఇంట్లో జన సంఖ్య పెరిగింది. సేద్యపు పనులు ముట్టని కోడల్లు వచ్చారు. వర్షాలు సరిగా కురవక, ఏ రెండు మూడేళ్లకో ఒకసారి మాత్రమే మెట్ట పంట చేతికి వచ్చేది. బావి కింద పండే పంటలో పెట్టుబడి, కరెంటు బిల్లులూ, కూలి ఖర్చులు పోనూ మిగిలినది తినేకి సరిపొయ్యేది. ఇద్దరు బిడ్డల పెళ్లిళ్లు కాస్తా ఆర్భాటంగా జరపటంతో ఏళ్ల తరబడి నిల్వ వుంచుకున్న నగదు మాయమైపోయింది.

కుటుంబం ఈ దశలో మూడు సంసారాలుగా చీలిపోయింది. ముగ్గురు అన్నదమ్ములూ విడిపోయారు. ఒక్కొక్కరికి ఇరవై ఎకరాల మెట్టా, మూడు ఎకరాల తోటా, పది తులాల బంగారూ, తమ భాగం కిందికి వచ్చింది. అప్పటికి కుటుంబానికి అప్పులేమీ లేవు – అయితే నగదు కూడా ఏమీ లేకుండా పోయింది –

ఎవరి భాగాలు వాళ్లు పోయాక, సంజీవప్ప స్వంతంగా ఒక చిన్న ఇల్లు కట్టుకున్నాడు. అతనికి ఇద్దరాడపిల్లలూ, ఒక మగపిల్లాడూ! కొడుకు అనంతపురంలో

బి.ఏ. చదువుతున్నాడిప్పుడు... ఊళ్లో వున్న హైస్కూల్లోనే ఆడపిల్లలను పదో తరగతి దాకా చదివించి మానిపించాడు. బిడ్డలు తెలివైనవాళ్లు. కాలేజీ చదువు చదివించకూడదా" అంటే "పెద్ద చదువులు చదివిస్తే అంతకంటే పెద్ద చదువులు చదివిన అల్లుళ్లను ఎక్కడ తెచ్చి పెడతాం–" అనేవాడు. "ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసేవాడికి తెలుస్తాయి కష్టాలు. బయట నుండి మాట్లాడే వాళ్లు ఎన్ని మాటలయినా మాట్లాడవచ్చు" అనుకొనేవాడు.

పిల్లలందరూ ఎదిగేసరికి సంజీవప్ప ఆర్థిక పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా మారిపోయింది. కొత్త ఖర్చులు రావటంతో నిభాయించుకోవటం కష్టమైపోయింది. ఒకసారి మూడు సంవత్సరాలు వరుసగా వర్షాలు రాకపోవటంతో బావులన్నీ ఎండి పోయాయి. తోట బీడువడి పోయింది – మెట్టలో అసలు పంటే లేదు. అటు చూస్తే కొడుకు చదువు – ఇంట్లో పెరిగిన ఖర్చులు – క్రమంగా అప్పులు అలవాటయ్యాయి – వాటికి వడ్డీలు – పంట చేతికి అందగానే వచ్చిన డబ్బు అందీ అందనట్టు మాయమైపోయేది – మెట్టలో శనక్కాయ వేస్తే పెట్టుబడులూ, కూలి ఖర్చులూ ఎకరాకు రెండు వేలు దాటుతోంది – వచ్చే పంట ఏ రెండు మూడు సంవత్సరాలకో ఒకసారిగాని గిట్టుబాటు కావటం లేదు –

ఇలాంటి పరిస్థితులలోనే మొదటి బిడ్డ పెళ్లి ఉన్నంతలోనే బాగా జరిపించాడు – 5 తులాల బంగారు పెట్టాడు – 30 వేలుకట్నం ఇచ్చాడు – పట్టు చీరలు పెట్టాడు – తీరా ఇచ్చింది సేద్యగానికే! సమీప బంధువుకే – అయినా ఖర్చు యాభైవేలు దాటింది – నలభైవేలు అప్పు నెత్తిమీద పడింది... అప్పులూ వడ్డీలూ తలకు మించి పోయేసరికి, ఊరికి దగ్గరగా వున్న 5 ఎకరాల మెట్ట అమ్మాల్సి వచ్చింది.

నాలుగేళ్ళ తర్వాత ఇప్పుడు రెండో కూతురు నిశ్చయమయింది. నిశ్చితార్థం జరిగి పది రోజులయింది, వచ్చే నెలలో పెళ్లి. ఇంట్లో పది తులాల బంగారు తప్ప పైసా లేదు. ఆ బంగారు కూడా తాను సంపాదించింది కాదు – తన భార్యకు వాళ్ల పుట్టింటి వాళ్లు పెట్టింది అది –

ఈసారి పెళ్లి సంబంధం కూడా కాస్తా ఖరీదైనదే! వరుడు పట్టణంలో పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. బేరసారాలు కుదిరింతర్వాత కట్నం ఒక లక్షగా నిర్ణయమైపోయింది. ఈ సంబంధానికి పూనుకోవటమే అతడు చేసిన దుస్సాహసం! ఆ దుస్సాహసానికి అతన్ని గురి చేసిన పరిస్థితులు కూడా అసాధారణమైనవేమీ కావు–

ఓ మేరకు ఆస్తి పాస్తులున్న వాడు ఆడపిల్లను సేద్యగానికి ఇచ్చి పెళ్లి చేయటం ఆ వూళ్లో ఇపుడు మొరటయిపోయింది. పైగా నామోషిగా కూడా భావించే పరిస్థితులొచ్చి పడ్డాయి - పైగా పదోతరగతి దాకా చదివిన ఆడపిల్లను, మళ్లీ కాయ కష్టం చేసుకునే రైతుకు ఇవ్వటం అంటే ఎంత నామర్దా అనేవాళ్లు కూడా తయారయ్యారు. కడగొట్టు ఆడపిల్లకయినా మంచి సంబంధం చూడమని ఇంట్లో ఆడవాళ్ల పోరు - బంధువుల ఒత్తిడి - బి.ఏ. చదువుతున్న కొడుకు అల్టిమేటం! రేపు నీ కొడుకుకు పెళ్ళి చేస్తే అంతకంతకు ముక్కుపిండి కట్నం వసూలు చేయ్యొచ్చులే అని భరోసా ఇచ్చే అనుభవజ్ఞులు! మళ్లీ మంచి పంట చేతికందకపోతుందా? అప్పులు చేస్తే మాత్రం తీరక పోతాయా? అని గుండె ధైర్యం చెప్పే అల్లాటప్పా మనుషులూ - అదీగాక ఈ మధ్య ఊళ్ళో జరుగుతున్న పెళ్లిళ్లు కూడా ఆవిధంగానే వుంటున్నాయి - ఏ సెకండరీ గ్రేడ్ టీచర్‌కో, ఏ గుమాస్తాకో ఇచ్చి చేసిన పెళ్లిళ్లు మరీ ఎక్కువైపోయాయి - ఇరవై ఎకరాల భూమి వున్న వాడికిచ్చే కంటే, నెలకు ఏ మూడు వేలో సంపాదించే ఉద్యోగి మేలుకదా! పిల్ల సుఖపడుతుంది, అన్నమాట అందరూ అనే కాలం వచ్చి పడింది. తన మొదటి బిడ్డను సేద్యగానికి ఇచ్చి పెళ్లి చేసి, ఆ బిడ్డ అనుభవిస్తున్న కష్టం కంటికి ఒకవైపు కనిపిస్తూనే వుంది! వెదకగా వెదకగా ఒక ఉద్యోగి సంబంధం దొరకటానికి సంవత్సరం పట్టింది సంజీవప్పకు.

అంతవరకూ బాగానే వుంది కాని అసలు సమస్య అంతా కట్నం కింద లక్ష రూపాయలు సమకూర్చటంలో వుంది! అదీగాక పెళ్లి ఖర్చులకు మరో ముప్పయి వేలన్నా కావాలి! ఇంతకుమునుపు ఐదు ఎకరాల భూమిని అమ్మటంలో ఎవరూ పెద్ద ఆక్షేపణ చేయలేదు - ఊరికి దగ్గరగా వున్న ఆ భూమి, రైతులకు దొడ్లు వేసుకొనేందుకు కాస్తా మంచి రేటుకే అమ్మినాడు. జరగక భూమిని అమ్ముకున్నాడు అని ఎవరూ అనుకునేందుకు వీలు లేదు ఆ అమ్మకం వ్యవహారం! ఆ వచ్చిన డబ్బు అంతా, పాత అప్పులు తీర్చటానికి కొంతా, బావి ఎండిపోతే బోర్ వేయించి సబ్ మెర్సిబుల్ మిషన్ బిగించటానికి కొంతా, ఇంకా, కాస్తా మిగిలితే, టీవీ, ఫాన్లూ, కుర్చీలూ కొనటానికి సరిపడిపోయింది - ఇప్పుడు భూమి అమ్మకానికి పెడితే, తన్ను బిడ్డ పెళ్లి చెయ్యటానికి గతి లేక భూమిని అమ్ముకున్నాడు అని గ్యారంటీగా అంటారు. అందువల్ల భూమి అమ్మే ప్రసక్తి లేదు - అయితే ఇంత డబ్బు పుట్టించటం అంటే మాటలా?

ఈసారి పండే శనక్కాయ పంట వేస్తానంటే అప్పుగా ఇవ్వటానికి సిద్ధంగా వుండే వాళ్లు ఊళ్లో లేకపోలేదు - అయితే ఆ వచ్చే మొత్తం 50 వేలు దాటదు - 15

ఎకరాలలో ఎనిమిది మూట్ల విత్తనాలు వేసినాడు సంజీవప్ప, మంచి పంట పండితే రెండు వందల మూటల కాయ అవుతుంది. అయితే పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు ఎందరికి తెలుస్తాయి. లక్ష రూపాయల శనక్కాయ పండుతుంది. ఆయనకేం అని అందరూ అనుకుంటారు – ఎప్పుడో ఏ మూడేళ్లకొకసారో, లక్ష రూపాయలు శనక్కాయల్లో వస్తే, సంజీవప్ప లక్ష రూపాయల రైతుకిందే ఆ వూళ్లో జమ!

గత రెండు సంవత్సరాలుగా శనక్కాయ పంట చేతికి చిక్కలేదు. పై నిరుడు, తీరా కాయ ఒలిసే టైమ్‌లో విడవకుండా వర్షాలు పట్టుకొని, నీరుగాయపడి, ఔటన్ రాక పెట్టుబడి కూడా గిట్టలేదు – నిరుడు అదునుకు వర్షాలు లేక ఆలస్యంగా విత్తనం పడి, ఎకరాకు నాలుగు మూటలు కూడా శనక్కాయ పండలేదు – ఈసారి పంట ఎలా వుంటుందో ఎట్ల చెప్పుతాము? సీతారామయ్య నడిగితే 50 వేలు ఇస్తానన్నాడు – పంటంతా తనకే అమ్మటం ఒక షరతు! రెండు రూపాయల వడ్డీ మరో షరతు!

కిరాణా అంగడిలోనూ, బట్టల షాపులోనూ, పెళ్లికి అవసరమయ్యే సరుకులూ, బట్టలూ అప్పు తేవచ్చు! అయినా మరో 60, 70 వేలు అవసరం! ఊళ్లో వాళ్ల దృష్టిలో సంజీవప్ప దగ్గర నగదు వున్నట్టే లెక్క! కొంతమంది రైతులు చూడ్డానికి అట్లే కనిపిస్తారు – లోపల చూస్తే తప్ప అసలు రంగు కనపడదు – అప్పుల్లో వున్న సంగతి అప్పులిచ్చిన వాళ్లకే తెలుస్తుంది. ఆ విధంగా ఆ వూళ్లో వున్న రైతులంతా అప్పుల్లో అంతో ఇంతో మునిగిన వాళ్లే! పైకి మాత్రం అందరూ అందరితో ఆయనకేం అని అనిపించుకొనేవాళ్లే! ఆ అనిపించుకోవటంలో కూడా కొద్దిపాటి సౌఖ్యం లేకపోలేదు. ఆ మాత్రం సౌఖ్యాన్ని సంజీవప్ప కూడా అనుభవింపక పోలేదు –

పెళ్లి దగ్గర పడుతోంది.

పెళ్లి తన ఇంట్లోనే!

పెళ్లికి కావాల్సిన సరంజామా సమకూరుస్తున్నాడు సంజీవప్ప!

శనక్కాయ పంట వేస్తానని సీతారామయ్య దగ్గర 50 వేలు తెచ్చి పెట్టుకున్నాడు. రెండు రూపాయల వడ్డీ మీద పత్రం రాసి ఇచ్చి

ఇంకా అవసరమైన మొత్తాన్ని సమకూర్చుకోవాలి!

ఆ రోజురాత్రి బాగా పొద్దుపోయిన తర్వాత సంజీవప్ప రామానాయుడి ఇంటికి బయల్దేరాడు. రామానాయుడి ఇంట్లోకి ఏదో వ్యవహారముంటే తప్ప ఎవరూ అడుగుపెట్టరు ఆ వూళ్లో! రామానాయుడు ఆస్తి పాస్తులు నికరంగా లెక్కగట్టి ఎవరూ చెప్పలేరు. ఊళ్లో భూములు, పట్టణంలో ఇళ్లూ, ఎన్నో వ్యాపారాలూ ఉన్నాయని

మాత్రం చెప్పుకుంటారు. అవన్నీ ఎలా సంపాదించాడంటే, దానికి కథలూ, గాథలూ చాలానే వున్నాయి. అలాంటి కథల్లోకి రేపు సంజీవప్ప కథ కూడా చేరవచ్చు! సంజీవప్ప నేరుగా ఆ రాత్రి రామానాయుడిని కలిసి తన అవసరాలన్నీ చెప్పుకున్నాడు. 70 వేలు ఇమ్మన్నాడు – రామానాయుడు సరే అన్నాడు – నీ తోటను ఆయకం పెట్టు అన్నాడు. అవసరమైన పత్రాలు రేపు సమకూరుస్తానన్నాడు. రేపు వచ్చి సంతకాలు పెట్టి పైకం తీసుకోవచ్చునన్నాడు. సంజీవప్ప తలూపి బయటకు వచ్చాడు.

రెండు వారాల తర్వాత సంజీవప్ప కూతురి పెళ్లి అనుకున్న విధంగా ఆనందంగానే జరిగింది.

అయితే ఆ తర్వాత సంజీవప్ప కథ ఏమిటి?

అతనికి శనక్కాయ పంట పండిందా?

సీతారామయ్య అప్పు ఎంత తీరింది?

వడ్డీ మాత్రమే చెల్లించాడా?

అసలు ఎప్పుడు తీరుతుంది?

బి.ఏ. చదివిన కొడుకుకు ఉద్యోగం వచ్చిందా?

ఉద్యోగం రాకపోతే కట్నం ఎంతవరకు వచ్చింది?

రామానాయుడికి ఆయకం పెట్టిన భూమిని విడిపించుకోగలిగాడా?

మూడు రూపాయల వడ్డీతో కలిపి అతని బాకీ సొమ్ము ఇంతై ఎంతై, ఎంతెంతై పెరిగింది?

ఆయకం గడువు తీరితే ఆ భూమి ఏమవుతుంది?

సంజీవప్ప ఏమవుతాడు?

ఇవన్నీ యక్షప్రశ్నలు–

వీటికి జవాబు కావాలంటే నాలుగేళ్ల తర్వాత మీరే సంజీవప్పను ఒకసారి చూడండి–

జవాబు అతడే చెప్పాల్సిన అవసరం లేదు–

అతన్ని చూస్తే చాలు మీకే తెలుస్తుంది.

**❖ ఆంధ్రజ్యోతి డైలీ, ఆగష్టు 1998**